సాక్షి అనంతపురం

సోమవారం । 17 । ఏప్రిల్ । 2023



'అనుబంధం' మొదలు
జేఎన్‌టీయూఏ పరిధిలో ఇంజినీరింగ్ కళాశాలల గుర్తింపు (అఫిలియేషన్) ప్రక్రియ మొదలైంది.
8లో



ఉచిత బియ్యం
పేదల సంక్షేమమే ధ్యేయంగా జగన్ సర్కార్ గత డిసెంబర్ నుంచి కార్డు దారులకు ఉచితంగా బియ్యం ఇస్తోంది.
8లో

గరిష్ఠం/కనిష్ఠం
42.3°/23.7°

జిల్లా అంతటా ఆదివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. తూర్పు దిశగా గాలులు గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో వీచాయి.



న్యూస్‌రీల్

ముఖ్యమంత్రి పర్యటన 26కు వాయిదా

- నేడు కలెక్టరేట్‌లో 'స్పందన' యథాతథం

సాక్షి ప్రతినిధి, అనంతపురం: శింగనమల నియోజకవర్గం నార్పల మండల కేంద్రంలో సోమవారం జరగాల్సిన 'జగనన్న వసతి దీవెన' కార్యక్రమం వాయిదా పడిందని కలెక్టర్ గౌతమి తెలిపారు. ఈ మేరకు ఆమె ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనివార్య కారణాల వల్ల రాలేకపోతున్నందున 'జగనన్న వసతి దీవెన' సభను ఈ నెల 26కు వాయిదా వేసినట్టు వెల్లడించారు. సీఎం పర్యటన వాయిదా పడిన నేపథ్యంలో సోమవారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో 'స్పందన' కార్యక్రమం యథావిధిగా ఉంటుందని స్పష్టం చేశారు.

యథావిధిగా పోలీస్ 'స్పందన'

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం పోలీస్ స్పందన కార్యక్రమం యథావిధిగా ఉంటుందని ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు.

మెరిట్ జాబితా విడుదల



అనంతపురం సప్తగిరి సర్కిల్: సివిల్ అసిస్టెంట్ సర్జన్ల పోస్టుల భర్తీకి సంబంధించి ప్రొవిజనల్ మెరిట్ జాబితాను విడుదల చేసినట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి వీరబ్బాయి తెలిపారు. మెరిట్ జాబితాను https://ananthapuramu.ap.gov.in వెబ్‌సైట్‌లో ఉంచామన్నారు. ప్రొవిజనల్ మెరిట్ జాబితాపై అభ్యంతరాలు ఉంటే ఈ నెల 19 సాయంత్రం 5 గంటలలోపు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో ప్రత్యక్షంగా సమర్పించాలని ఆయన కోరారు.

ఆ.. కేంద్రాల్లో తరగతులు నిర్వహించకూడదు



రాప్తాడురూరల్: పదో తరగతికి సంబంధించి సోమవారం, మంగళవారం రెండు రోజులు కాంపోజిట్ పరీక్షలు జరగనున్నాయి. ఈ పరీక్షలున్న కేంద్రాల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతర తరగతులు నిర్వహించకూడదని డీఈఓ ఎం.సాయిరామ్ స్పష్టం చేశారు. సోమవారం 62 సెంటర్లలో, మంగళవారం 21 కేంద్రాల్లో పరీక్షలు ఉంటాయన్నారు. కొందరు హెచ్‌ఎంలు పరీక్షలు ముగిసిన అనంతరం మధ్యాహ్నం నుంచి తరగతులు ఉంటాయంటూ ప్రచారం చేస్తున్నట్లు తనదృష్టికి వచ్చిందన్నారు. పరీక్షల అనంతరం ఎట్టి పరిస్థితుల్లోనూ తరగతులు పెట్టకోవద్దన్నారు. పరీక్ష కేంద్రం ఉన్న పాఠశాలలో ఇతర తరగతులకు సెలవు ఇవ్వాల్సిందేనన్నారు. ఎవరైనా తరగతులు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

'కాలవ' కుట్ర భగ్నం!

రాయదుర్గం: కల్పితాల ద్వారా రాజకీయ లబ్ధి పొందాలనుకున్న టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులు కుట్ర భగ్నమైంది. సంక్షేమ పథకాలపై తనకున్న అనుమానాలను ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి నివృత్తి చేస్తే.. ఈ అంశాన్ని పక్కదారి పట్టించేలా కాలవ వక్రీకరించారని కణేకల్లు మండలం బ్రహ్మసముద్రానికి చెందిన టీడీపీ కార్యకర్త వన్నూరుస్వామి పేర్కొన్నారు. రెండు రోజుల క్రితం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ విప్ తన ఇంటి వద్దకు వచ్చి పథకాల గురించి వివరించి ముందుకెళ్లారన్నారు. అయితే ఈ అంశాన్ని పక్కదారి పట్టిస్తూ గుమ్మఘట్ట మండలం 75 వీరాపురంలో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమంలో పాల్గొన్న ఫొటోలను జత చేసి ఎల్లో మీడియా ద్వారా కాలవ వైరల్ చేశారన్నారు. వాస్తవాన్ని గుర్తించకుండా ఈ అంశాన్ని రాజకీయ లబ్ధికి ఉపయోగించుకునేలా కాలవ ప్రయత్నించడం బాధాకరమన్నారు. కాలవ తీరు పల్లెల్లో చిచ్చురేపేలా ఉందన్నారు.

దిగజారుడు రాజకీయాలు..

కాలవ శ్రీనివాసులు దిగజారుడు రాజకీయాలు ఒక్కొక్కటిగా బహిర్గతమవుతున్నాయని విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. రాజకీయ లబ్ధి కోసం బురదజల్లే ఇలాంటి విధానాలు ఇకనైనా మానుకోవాలని హితవు పలికారు.

మల్బరీ.. సిరుల ఝురి

- శ్రీసత్యసాయి జిల్లాలో ఏడాదికి 5 లక్షల మందికి ఉపాధి
- అనంతపురం జిల్లాలో 70వేల మందికి
- రాష్ట్రంలో ఉత్పత్తయ్యే పట్టుగూళ్లలో 41 శాతం 'శ్రీసత్యసాయి' నుంచే
- ముడి సిల్క్‌లోనూ ప్రధాన భాగస్వామ్యం
- ఇక్కడ పండించిన పట్టు ఎక్కువగా కర్ణాటకకు ఎగుమతి
- సామాజిక ఆర్థిక సర్వేలో ఉమ్మడి అనంతకు ప్రత్యేక స్థానం



అనంతపురం జిల్లాలో..	
ఉద్యోగం/ఉపాధి పొందుతున్న వారి సంఖ్య	70,289
మల్బరీ తోటల విస్తీర్ణం	6,887 ఎకరాలు
ముడి సిల్క్ ఉత్పత్తి	384.5 మెట్రిక్ టన్నులు
పట్టుగూళ్ల ఉత్పత్తి	2,805.5 మెట్రిక్ టన్నులు
సెరికల్చర్ రైతులు	3,513
శ్రీసత్యసాయి జిల్లాలో..	
ఉద్యోగం/ఉపాధి పొందుతున్న వారి సంఖ్య	5,00,781
మల్బరీ తోటల విస్తీర్ణం	49,067 ఎకరాలు
ముడి సిల్క్ ఉత్పత్తి	2,847.66 మెట్రిక్ టన్నులు
పట్టుగూళ్ల ఉత్పత్తి	20,776.5 మెట్రిక్ టన్నులు
సెరికల్చర్ రైతులు	26,332

సాక్షి ప్రతినిధి, అనంతపురం: రాష్ట్రంలోనే అత్యధికంగా మల్బరీ సాగు చేస్తున్న జిల్లాగా ఉమ్మడి అనంతపురం పేరు గడించింది. రాష్ట్రవ్యాప్తంగా 13.73 లక్షల మందికి ఈ పంట ఉద్యోగ/ఉపాధి అవకాశాన్ని కల్పిస్తోంది. ఒక్క ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే 5.70 లక్షల మందికి ఉపాధి కలుగుతున్నట్లు సామాజిక ఆర్థిక సర్వేలో తేలింది. ఇందులో శ్రీసత్యసాయి జిల్లాలోనే 5 లక్షల మందికి మల్బరీ సాగు ద్వారా ఉపాధి లభిస్తోంది. అనంతపురం జిల్లాలో 70వేల మందికి పైగా దీనివల్ల లబ్ధి పొందుతున్నారు. ఉమ్మడి జిల్లాలో 30 వేల మంది రైతులు 57 వేల ఎకరాల్లో మల్బరీ సాగు చేస్తున్నారు. ముఖ్యంగా శ్రీసత్యసాయి జిల్లా మడకశిర నియోజక వర్గంలో వేలాది మంది రైతులు మల్బరీపైనే ఆధారపడ్డారు. అనంతపురం జిల్లాలో కళ్యాణదుర్గం నియోజకవర్గంలో ఎక్కువగా మల్బరీ సాగుచేస్తున్నారు.

పేరుమోసిన మార్కెట్లు ఇక్కడే..

పట్టుగూళ్లకు పేరు మోసిన మార్కెట్లుగా హిందూపురం, ధర్మవరం, కదిరి మార్కెట్లు ఉన్నాయి. ఇదొకఎత్తయితే కర్ణాటక రాష్ట్రంలోని రామ్‌నగర్ మార్కెట్‌కు మన రాష్ట్రం నుంచి వేలాది టన్నుల పట్టుగూళ్లు ఎగుమతి అవుతున్నాయి. కనీవినీ ఎరుగని రీతిలో శ్రీసత్యసాయి జిల్లాలో 20,776 మెట్రిక్ టన్నుల పట్టు ఉత్పత్తి అయినట్టు వెల్లడైంది. ఈ మార్కెట్ల నుంచి ఏటా కోట్లాది రూపాయల లావాదేవీలు జరుగుతున్నాయి. రాష్ట్రంలో పట్టుగూళ్ల ఉత్పత్తి 50,331 మెట్రిక్ టన్నులు కాగా.. అందులో 41 శాతం శ్రీసత్యసాయి జిల్లా నుంచే కావడం గమనార్హం.

వాతావరణం అనుకూలం



కర్ణాటక సరిహద్దున ఉండటంతోపాటు వాతావరణ పరిస్థితులు పట్టు దిగుబడికి ఎంతో అనుకూలంగా ఉన్నాయి. లాభసాటి ధరలు పలుకుతుండటంతో హిందూపురం, మడకశిర, పెనుకొండ ప్రాంతాల్లో ఎక్కువశాతం రైతులు మల్బరీ సాగుపై ఆసక్తి చూపుతున్నారు. శ్రమ తక్కువ.. లాభం ఎక్కువ ఉంటోంది. హిందూపురంలోనే అతిపెద్ద పట్టుగూళ్ల మార్కెట్ ఉండటం వల్ల రైతులు నేరుగా దిగుబడులు తీసుకొచ్చి అమ్ముకోవడానికి వీలు ఉంది. అంతేగాక ప్రభుత్వం పట్టుపురుగుల పెంపకానికి షెడ్లు, మల్బరీ మొక్కలు నాటడానికి సబ్సిడీలు అందిస్తోంది.

– డి.సురేష్‌కుమార్, ఏడీ, సెరికల్చర్, హిందూపురం.

మల్బరీ సాగు లాభదాయకం



ఇతర పంటలతో పోల్చుకొంటే మల్బరీ సాగు అధిక లాభదాయకం. బోరుబావి కింద 1.5 ఎకరాల విస్తీర్ణంలో మల్బరీ సాగు చేశాను. ఏడాదికి ఐదు పంటలు తీస్తున్నాం. ప్రతి పంటకూ రూ.50 వేల వరకు ఖర్చులు వస్తున్నాయి. ఖర్చులు పోను ఏటా రూ.3.5 లక్షల నుంచి రూ.4.5 లక్షల వరకు ధరలను బట్టి ఆదాయం పొందుతున్నాం. అంతేకాకుండా ప్రతి కేజీకి ప్రభుత్వం ఇన్సెంటివ్ (ప్రోత్సాహక నగదు) కింద రూ.50 ఇస్తోంది.

– శ్రీనివాస్‌రెడ్డి, మల్బరీ రైతు, హెచ్‌టీ హళ్లి, రొళ్ల మండలం

సజావుగా గురుకుల ప్రవేశ పరీక్ష

రాప్తాడురూరల్: మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతి ప్రవేశానికి ఆదివారం నిర్వహించిన పరీక్ష సజావుగా జరిగింది. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన పరీక్షకు జిల్లా వ్యాప్తంగా మొత్తం 2,023 మంది విద్యార్థులకు గాను 1,943 మంది హాజరయ్యారని బీసీ గురుకుల పాఠశాలల జిల్లా కన్వీనర్ సంగీతకుమారి తెలిపారు. అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగాయని ఆమె వెల్లడించారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట



సిబ్బందితో మాట్లాడుతున్న డీఐజీ అమ్మిరెడ్డి

రాప్తాడు: అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేస్తామని డీఐజీ అమ్మిరెడ్డి తెలిపారు. రాప్తాడు పోలీస్‌స్టేషన్‌ను ఆదివారం ఆయన తనిఖీ చేశారు. పెండింగ్ కేసులు, చోరీలు, రికవరీలు తదితర వాటిపై ఇటుకులపల్లి సీఐ మోహన్, ఎస్ఐ పి.వై.ఆంజనేయులు, సిబ్బందితో సమీక్షించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. బాలికలపై అఘాయిత్యాలకు పాల్పడే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామన్నారు. 'దిశ' స్టేషన్‌ను ఆశ్రయించే బాధితులకు అండగా నిలిచి, న్యాయం జరిగేలా చూస్తామన్నారు. దిశ యాప్‌పై అవగాహన కల్పించి, అమ్మాయిల స్మార్ట్‌ఫోన్లలో డౌన్‌లోడ్ చేయించేలా చూస్తామన్నారు. మట్కా, అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు నిరంతర నిఘా ఉంచామన్నారు. పోలీసులపై ప్రజల్లో నమ్మకం పెరిగేలా తమ సేవలుంటాయన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో రాజీ పడబోమన్నారు. ప్రజల సహకారంతో అసాంఘిక శక్తుల ఆటకట్టిస్తామన్నారు. జిల్లాను ప్రశాంతంగా ఉంచడమే తమ ధ్యేయమని అన్నారు.

జాజరకల్లులో ఇథనాల్ ఇంధన ప్లాంట్

- ముందుకొచ్చిన ఎకో స్టీల్ కంపెనీ
- రూ.102 ఎకరాల విస్తీర్ణంలో పరిశ్రమ
- ప్రత్యక్షంగా, పరోక్షంగా 1500 మందికి పైగా ఉపాధి



ఇథనాల్ ఇంధన పరిశ్రమ నమూనా

అనంతపురం టౌన్: రాష్ట్రంలో ఆహార ధాన్యాల నుంచి ఇథనాల్ తయారీకి పలు సంస్థలు ముందుకొచ్చాయి. అందులో భాగంగా ఎకో స్టీల్ కంపెనీ ఉమ్మడి అనంతపురం జిల్లా రాయదుర్గం నియోజకవర్గం డి.హీరేహాళ్ మండలం జాజరకల్లులో మొక్కజొన్న నుంచి ఇథనాల్ ఇంధనం తయారు చేసే ప్లాంట్ ఏర్పాటు చేయనుంది. ఇప్పటికే ఆ కంపెనీ యాజమాన్యం రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. 102 ఎకరాల విస్తీర్ణంలో పరిశ్రమ నెలకొల్పనుంది. ఈ మేరకు స్థలాన్ని సేకరించినట్లు తెలుస్తోంది. దాదాపు రూ.554 కోట్ల పెట్టుబడితో పరిశ్రమ ఏర్పాటు చేసి ప్రత్యక్షంగా 500 మందికి, పరోక్షంగా మరో వెయ్యి మందికిపైగా ఉపాధి అవకాశాలు కల్పించనుంది. ఇథనాల్ ఇంధనాన్ని ప్రస్తుతం పెట్రోల్‌లో కలిపేందుకు వినియోగిస్తున్నారు. రానున్న రోజుల్లో గ్యాస్ సిలిండర్ స్థానంలో ఇథనాల్ వంట సిలిండర్లను వాడుకునేందుకు సైతం అవకాశం ఉంది. ఈ విషయంపై జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నాగరాజరావును వివరణ కోరగా ఇప్పటికే ఎకో స్టీల్ కంపెనీ రాష్ట్ర ప్రభుత్వంతో ఇటీవల విశాఖపట్నంలో నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్‌లో ఎంఓయూ కుదుర్చుకుందన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి పర్యావరణ అనుమతులు రాగానే ప్లాంట్ నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు.

'పది' మూల్యాంకనం సజావుగా సాగాలి

రాప్తాడురూరల్: పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం (స్పాట్) సజావుగా సాగేలా ఉపాధ్యాయ సంఘాలు సహకరించాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.సాయిరామ్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం అనంతపురంలోని కేఎస్ఆర్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందు నాయక్, అనంతపురం డెప్యూటీ డీఈఓ పద్మప్రియతో కలిసి డీఈఓ మాట్లాడారు. పదో తరగతి రెగ్యులర్, ఓపెన్ స్కూల్ పరీక్షలు మొదటి రోజు మినహా మిగిలిన అన్ని రోజులూ ప్రశాంతంగా జరిగాయన్నారు. ఇందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ నెల 19 నుంచి కేఎస్ఆర్ బాలికల పాఠశాల కేంద్రంగా టెన్త్ మూల్యాంకనం జరుగుతుందన్నారు. ఇప్పటికే కోడింగ్ జరుగుతోందన్నారు. ఏఈలు, సీఈలుగా నియమించిన టీచర్లను హెచ్‌ఎంలు వెంటనే రిలీవ్ చేయాలన్నారు. నాడు-నేడు పనులు జరుగుతున్న పాఠశాలల హెచ్‌ఎంలకు ఈ విధుల నుంచి మినహాయింపు ఇస్తామన్నారు. ఆ స్కూళ్లలో జరుగుతున్న పనుల పర్యవేక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పనులకు ఆటంకం కలగకుండా గడువులోగా పూర్తయ్యేలా చూడాలన్నారు. ప్రభుత్వ నిబంధన ప్రకారంగానే మూల్యాంకనం ప్రక్రియ నిర్వహిస్తామన్నారు. గోవిందునాయక్ మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలను విజయవంతంగా నిర్వహించడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. అలాగే స్పాట్ వాల్యుయేషన్ ప్రక్రియను కూడా విజయవంతం చేయాలని కోరారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు పలు సమస్యలను డీఈఓ దృష్టికి తీసుకొచ్చారు. మూల్యాంకనం కేంద్రంలో తగిన వసతులు కల్పించాలని, హెల్త్ క్యాంపు ఏర్పాటు చేయాలన్నారు.



మాట్లాడుతున్న డీఈఓ సాయిరామ్

పది 'స్పాట్' క్యాంపు అధికారిగా డీఈఓ

ఈ నెల 19 నుంచి అనంతపురంలోని కేఎస్ఆర్ బాలికల ఉన్నత పాఠశాల వేదికగా మూల్యాంకనం ప్రక్రియ మొదలు కానుంది. కీలకమైన అసిస్టెంట్ ఎగ్జామినర్ల నియామక ప్రక్రియ పూర్తయింది. 20 శాతం అదనపు సంఖ్యతో కలిపి మొత్తం 1,057 మందిని నియమించారు. స్పాట్ క్యాంపు అధికారిగా డీఈఓ సాయిరామ్ వ్యవహరిస్తారు. డిప్యూటీ క్యాంపు అధికారిగా ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందునాయక్, డిప్యూటీ క్యాంపు అధికారి (అడ్మిన్)గా డిప్యూటీ డీఈఓ శంకర్‌ప్రసాద్‌ను నియమించారు. అసిస్టెంట్ క్యాంపు ఆఫీసర్లుగా మరో 8 మంది నియమితులయ్యారు.

నచ్చిన కళాశాలా? మెచ్చిన కోర్సా?

- అన్వేషణలో విద్యార్థుల తల్లిదండ్రులు
- ఏపీ ఈఏపీసెట్ ప్రారంభం కాకముందే వాకబు
- కళాశాలలు, డీమ్డ్ వర్సిటీల్లో మొదలైన హడావుడి



మొదలైన హడావుడి..

అనంతపురం: ఏపీ ఈఏపీసెట్ పరీక్షలు ప్రారంభం కాకముందే విద్యార్థుల తల్లిదండ్రులు ఇంజినీరింగ్ కళాశాలల కోసం వెతుకులాట మొదలు పెట్టారు. ఏ కళాశాలలో ఏ కోర్సులు ఉన్నాయి? ఈఏపీసెట్‌లో ఎంత ర్యాంకు వస్తే ఏ కళాశాలలో సీటు వస్తుంది? ఏయే కోర్సులకు డిమాండ్ ఉంది? నచ్చిన కోర్సు ఎక్కడ బాగుంటుంది? ఇలా అనేక అంశాలపై వాకబు చేస్తున్నారు. వీళ్లంతా ప్రధానంగా మంచి ప్లేస్‌మెంట్‌లు దక్కుతున్న కళాశాలలపైనే దృష్టి పెడుతున్నారు. వీటితో పాటు డీమ్డ్ యూనివర్సిటీల వివరాలూ సేకరిస్తున్నారు. ఈఏపీసెట్ ర్యాంకుపై ఆశల్లేని వారు ముందే సీటు ఖాయం చేసుకోవాలనే ఆతృతతో ఉన్నారు. మేనేజ్‌మెంట్ సీటు గురించి వాకబు చేస్తున్నారు. ఈఏపీసెట్‌లో మంచి ర్యాంకు వస్తుందని ఆశించే విద్యార్థుల తల్లిదండ్రులు మాత్రమ గత కొన్నేళ్ల కౌన్సెలింగ్ వివరాలను బట్టి అంచనాల్లో మునిగి తేలుతున్నారు. సీట్ల వివరాల కోసం వస్తున్న వారికి ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాయి. కంప్యూటర్ సైన్సెస్ కోర్సులు కావాలనుకునే వాళ్లు ముందే వాకబు చేస్తున్నారని, వీరంతా మేనేజ్‌మెంట్ కోటా సీట్లు ఆశిస్తున్నవారేనని అనంతపురం నగరానికి చెందిన ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాల నిర్వాహకులు తెలిపారు. మేనేజ్‌మెంట్ కోటా సీట్లు ముందే మాట్లాడుకుంటే ఫీజు తగ్గుతుందనే ఉద్దేశంతో ప్రయత్నిస్తున్నారు. ఈ పరిస్థితిని గమనించిన కళాశాలలు ఈఏపీసెట్ పూర్తవ్వగానే సంప్రదింపుల పేరుతో బేరసారాలు చేసుకోవాలనే ఆలోచనలో ఉన్నాయి. ప్రైవేట్ డీమ్డ్ యూనివర్సిటీలు ఇప్పటికే ప్రవేశాల ప్రక్రియను మొదలుపెట్టాయి. వేర్వేరుగా సెట్స్ నిర్వహణ తేదీలను వెల్లడించాయి. మంచి ర్యాంకు వస్తే ఫీజు రాయితీ ఇస్తామని ప్రకటించాయి. భారీ ఫీజులుండే ఈ వర్సిటీల్లో సీట్లు నింపుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నాయి. ప్రత్యేకంగా పీఆర్వోలను, ఏజెంట్లను కూడా నియమించాయి. ఇంటర్మీడియెట్ కళాశాలలకు వెళ్లి తమ ప్రవేశపరీక్ష, కోర్సుల వివరాలు, వాళ్లిచ్చే సదుపాయాలతో విద్యార్థులను ఆకర్షించే ప్రయత్నంలో ఉన్నాయి.

కళాశాల ఎంపికే కీలకం



ప్రస్తుత పరిస్థితుల్లో ఇంజినీరింగ్ ఇంటర్ డిసిప్లనరీ ప్రాధాన్యత పెరిగింది. ఈ నేపథ్యంలో ఏ బ్రాంచ్‌లో ఇంజినీరింగ్ చేసినా అవకాశాలు అధికంగా ఉన్నాయి. మెకానికల్, సివిల్ ఇంజినీరింగ్ బ్రాంచ్‌ల్లో చదివిన వారు సైతం సాఫ్ట్‌వేర్ కొలువులు దక్కుతున్నాయి. ఈ క్రమంలో బ్రాంచ్ అనే అంశం పెద్ద ప్రాధాన్యత కాదు. అన్ని హంగులతో కూడిన కళాశాల ఎంపికే కీలకం. అనుభవజ్ఞులైన అధ్యాపకులు ఉండాలి. వీలైతే నేరుగా కళాశాలకు వెళ్లి పరిస్థితులను గమనించి ఎంపిక చేసుకుంటే ఉత్తమం.

– డాక్టర్ ఆర్.రామచంద్ర, ప్రిన్సిపాల్, ఎస్కేయూ ఇంజినీరింగ్ కళాశాల

అధ్యయనం చేయాలి



కళాశాల స్థితిగతులను పూర్తిగా అధ్యయనం చేయాలి. గడిచిన ఐదేళ్లలో క్యాంపస్ ప్లేస్‌మెంట్లు, ల్యాబ్ సదుపాయాలు, ఫ్యాకల్టీ తదితర అంశాలను బేరీజు వేసుకోవాలి. వీలైతే పూర్వ విద్యార్థులతో ఆరా తీయాలి. మైనర్ డిగ్రీ, ఆన్‌లైన్ కోర్సులు, న్యాక్ గ్రేడింగ్ తదితర అంశాలను పరిశీలించాలి. ప్రధాన బ్రాంచ్‌తో పాటు అదనపు బ్రాంచ్ చదివితే మైనర్ డిగ్రీ ప్రదానం చేసే విధానం అమల్లోకి వచ్చింది. ఇలాంటి కోర్సుల వల్ల ఒకే డిగ్రీతో రెండు రకాల ప్రయోజనాలు ఉన్నాయి. ట్రెండ్‌ను బట్టి రంగాన్ని ఎంపిక చేసుకోవచ్చు.

– డాక్టర్ డి.విష్ణువర్ధన్, ఈసీఈ విభాగాధిపతి, జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల

20 నుంచి సమ్మేటివ్ అసెస్మెంట్–2 పరీక్షలు

రాప్తాడురూరల్: జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో 1 నుంచి 9వ తరగతి విద్యార్థులకు ఈ నెల 20 నుంచి సమ్మేటివ్ అసెస్మెంట్ -2 పరీక్షలు నిర్వహించనున్నట్లు డీఈఓ ఎం.సాయిరామ్ తెలిపారు. పరీక్షల నిర్వహణపై ఆదివారం సంబంధిత సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో డీఈఓ మాట్లాడుతూ 1 - 8 తరగతులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, 9వ తరగతి విద్యార్థులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.05 గంటల వరకు పరీక్షలు ఉంటాయన్నారు. 1 - 5 తరగతులకు ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలకు మాత్రమే డీసీఈబీ ద్వారా ప్రశ్నపత్రాలు అందజేస్తామన్నారు. 6 - 9 తరగతులకు మాత్రం అన్ని యాజమాన్య పాఠశాలలకు డీసీఈబీ ద్వారా ప్రశ్నపత్రాలు సరఫరా చేస్తామన్నారు.

- ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో మాత్రమే 1-8 తరగతి వరకు ఓఎంఆర్ ఆధారిత పరీక్షలు ఉంటాయి.
- పదో తరగతి పరీక్షల విధానాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రశ్నపత్రాలపై అవగాహన కల్పించడానికి ఈ ఏడాది 9వ తరగతికి ఆరు సబ్జెక్టులూ 100 మార్కులకు ప్రశ్న పత్రాలు రూపొందించారు. కానీ ఉపాధ్యాయులు 80 మార్కులకు రెడ్యూస్ చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి.
- సమ్మేటివ్ అసెస్మెంట్-2లో ప్రైవేట్ యాజమాన్య పాఠశాలల విద్యార్థుల విద్యా ప్రమాణాలను పరీక్షించడానికి పైలట్ స్టడీగా ప్రతి జిల్లా నుంచి 1 నుంచి 8వ తరగతి వరకు ఒక్కొక్క తరగతిలో 1000 మంది విద్యార్థులను, ప్రభుత్వ పాఠశాలలకు సరఫరా చేసిన ప్రశ్నపత్రాలు, ఓఎంఆర్‌ను పరీక్షించడానికి తగిన ఏర్పాట్లు చేసేస్తున్నారు.
- ప్రభుత్వం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు ఉప విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీలు వారి పరిధిలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని డీఈఓ ఆదేశించారు. సమావేశంలో డీసీఈబీ కార్యదర్శి లోకేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

జిల్లా సీనియర్ హాకీ జట్టు ఎంపిక

అనంతపురం సప్తగిరి సర్కిల్: ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకూ శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరంలో జరిగే రాష్ట్రస్థాయి సీనియర్ హాకీ టోర్నీలో ప్రాతినిథ్యం వహించే జిల్లా జట్టును ఆదివారం ఎంపిక చేశారు. జట్టులో చోటు దక్కించుకున్న వారిలో శివ, సంతోష్, జశ్వంత్, వెంకటేష్, అనిల్ కుమార్, దేవానంద్‌రెడ్డి, సాయికిరణ్, భానుప్రకాష్‌రెడ్డి, గంగాధర్, భరత్‌బాబు, శివానందరెడ్డి, రాజన్న, నవీంద్ర, శివసాయి, చంద్రమౌళి, సుమంత్, వన్నూరుస్వామి, గోవర్ధన్ ఉన్నారు. అలాగే స్టాండ్‌బైలుగా మణికంఠ, మహేష్, అజయ్ ఎంపికయ్యారు. ఈ ఎంపికలను జిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు విజయబాబు, అనిల్‌రాజ్‌కుమార్ పర్యవేక్షించారు.

'అనుబంధం' మొదలు

- ఇంజినీరింగ్ కళాశాలల్లో తనిఖీలకు రంగం సిద్ధం
- ముగ్గురు చొప్పున నిపుణుల ద్వారా పరిశీలన
- అన్నీ ఉంటేనే అనుమతులు
- మే నెలాఖరుకల్లా తనిఖీలు పూర్తి


జేఎన్‌టీయూ అనంతపురం పాలకభవనం

అనంతపురం: జేఎన్‌టీయూ (అనంతపురం) పరిధిలో 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంజినీరింగ్ కళాశాలల అనుబంధ (అఫిలియేషన్) గుర్తింపు ప్రక్రియ మొదలైంది. రాయలసీమ జిల్లాలతో పాటు నెల్లూరు జిల్లాలో జేఎన్‌టీయూ (ఏ)కు అనుబంధంగా పలు ఇంజినీరింగ్ కళాశాలలు ఉన్నాయి. వీటికి వర్సిటీ గుర్తింపునిచ్చే ప్రక్రియను అధికారులు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా ఇప్పటికే ఆయా కళాశాలలకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరించారు. వీటి ఆధారంగా ప్రతి కళాశాలను ముగ్గురు సభ్యులుగా ఉన్న నిజనిర్ధారణ కమిటీ పరిశీలించి, అక్కడి స్థితిగతులను అంచనా వేసి, నివేదికను సిద్ధం చేయనున్నారు. ఈ ఏడాది ఎంసెట్ కౌన్సెలింగ్ మొదలయ్యే నాటికే అనుబంధ ప్రక్రియ పూర్తి చేసే దిశగా అధికారులు అడుగులేస్తున్నారు.

121 కళాశాలల్లోతనిఖీలు..

జేఎన్‌టీయూ (ఏ) పరిధిలో 98 ఇంజినీరింగ్ కళాశాలలు, 23 ఫార్మసీ కళాశాలలున్నాయి. వీటిల్లో ప్రధానంగా కంప్యూటర్ సైన్సెస్, దానికి అనుబంధంగా ఉన్న సరికొత్త కోర్సుల బోధనాంశాలు, మౌలిక సదుపాయాలపై అధికారులు దృష్టి సారించారు. సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్సెస్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్ వంటి కోర్సుల్లో ఆయా కళాశాలల్లో అవసరమైన కార్యాచరణ ఉందా? సరైన ఫ్యాకల్టీలు ఉన్నారా? మౌలిక సదుపాయాలు ఏ మేరకు ఉన్నాయి? తదితర అంశాలను నిజనిర్ధారణ కమిటీ బృందాలు నిశితంగా పరిశీలించాలని ఇటీవల జరిగిన వర్సిటీ ఉన్నత స్థాయి సమావేశం నిర్ణయించింది. బయోమెట్రిక్ హాజరు విధానాన్ని యూనివర్సిటీలు తప్పనిసరి చేసినా, పలు ప్రైవేట్ కళాశాలల నిర్వాహకులు దీనిని ఆచరణలో పెట్టలేదు. దీంతో విద్యాసంవత్సరం నుంచి ఈ విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని నిర్ణయించారు.

వెలుగు చూస్తున్న అక్రమాలు..

ఇప్పటి వరకూ నిజనిర్ధారణ కమిటీ సభ్యులు చేపట్టిన తనిఖీలు ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలల అక్రమాలు ఒక్కొక్కటి వెలుగులోకి వస్తున్నాయి. తిరుపతి పరిధిలో ఉన్న ఓ ఇంజినీరింగ్ కళాశాలలో కేవలం 39 మంది ఫ్యాకల్టీ ఉన్నారు. అయితే తమ కళాశాలలో ఏకంగా 165 మంది అధ్యాపకులు ఉన్నట్లు జేఎన్‌టీయూ(ఏ)కు ఇచ్చిన సమాచారంలో పొందుపరిచారు. నిబంధనల మేరకు ప్రతి బ్రాంచ్‌లోనూ అసోసియేట్ ప్రొఫెసర్ స్థాయి పనిచేస్తున్న ప్రతి ఒక్కరికీ పీహెచ్‌డీ తప్పనిసరిగా ఉండాలి. అయితే చాలా కళాశాలల్లో ఇంజినీరింగ్‌లో పీహెచ్‌డీ పూర్తి చేసిన అధ్యాపకులు లేరు. బీటెక్ పూర్తయ్యాక నేరుగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల్లో చేరడంతో ఎంటెక్, పీహెచ్‌డీ వైపు వెళ్లే వారి సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. చాలా కళాశాలల్లో కంప్యూటర్ సైన్సెస్‌కు అదనపు బ్రాంచ్‌లు ఎక్కువగా ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో పనిచేస్తున్న అధ్యాపకులకు సైతం పీహెచ్‌డీ లేకపోవడం గమనార్హం. ఈ నేపథ్యంలో అర్హుడైన అధ్యాపకుడి సర్టిఫికెట్లు పెట్టుకుని ప్రతి నెలా వారికి గౌరవ వేతనం చెల్లిస్తూ కోర్సులు నిర్వహిస్తున్నారు. అందుబాటులో ఉన్న ఒక్కో అధ్యాపకుడి పేరుతో ఏకంగా 12 కళాశాలలు దరఖాస్తు చేసుకున్న వైనం గత ఏడాది తనిఖీల్లో బట్టబయలైంది.

లోపాయికార ఒప్పందాలపై ప్రత్యేక నిఘా..

తనిఖీల విషయంలో గతంలో నిజనిర్ధారణ కమిటీ సభ్యులతో కళాశాల యాజమాన్యాలు లోపాయికార ఒప్పందాలు చేసుకుని బయటపడుతూ వచ్చాయి. ఈ క్రమంలో ఆయా కళాశాలల్లో మౌలిక సదుపాయాలు లేకున్నా అనుమతులు మంజూరు చేసేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో లోపాయికార ఒప్పందాలపై ఈ సారి వర్సిటీ అధికారులు ప్రత్యేక నిఘా ఉంచారు. ఆయా కళాశాలలో బోధనా సిబ్బంది వివరాలను సమగ్రంగా ఆన్‌లైన్‌లో నమోదు చేయడమే కాక, పారదర్శకత కోసం వారి వ్యక్తిగత పాన్‌కార్డుల ఆధారంగా ఆదాయపు పన్నుశాఖ ద్వారా తనిఖీలు చేయించాలనే యోచనలో ఉన్నారు. దరఖాస్తులో పేర్కొన్న ఫ్యాకల్టీ అర్హత ప్రమాణాలు ఏమిటి? అఫిలేయషన్ కోసం దరఖాస్తు చేసుకున్న కళాశాలలోనే పని చేస్తున్నారా? తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించనున్నారు.

నిబంధనల మేరకే గుర్తింపు



వర్సిటీ అనుబంధ గుర్తింపు ప్రక్రియను మే నెలాఖరుకల్లా పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నాం. దరఖాస్తు చేసుకున్న కళాశాలల్లోని ఫ్యాకల్టీలు, వసతుల వివరాలను సేకరించాం. ఆయా కళాశాలలను నిజనిర్ధారణ కమిటీ సభ్యులు పరిశీలిస్తున్నారు. నిబంధనల మేరకు అన్నీ సక్రమంగా ఉంటేనే గుర్తింపు మంజూరు చేస్తాం. – ఆచార్య జింకా రంగజనార్ధన, వీసీ, జేఎన్‌టీయూ (ఏ)

క్లుప్తంగా

కల్పిత కథనాలకు స్పందించొద్దు

- సీబీఐ అధికారులకు ఎమ్మెల్సీ శివరామిరెడ్డి సూచన


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శివరామిరెడ్డి

ఉరవకొండ: దివంగత వైఎస్సార్ కుటుంబాన్ని అప్రతిష్టపాలు చేయడం ద్వారా రాజకీయంగా ఓ పార్టీకి లబ్ధి చేకూర్చాలని చూస్తున్న పచ్చమీడియా కల్పిత కథనాలకు స్పందించరాదని సీబీఐ అధికారులకు ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి సూచించారు. వైఎస్ భాస్కర్‌రెడ్డి అరెస్టును ఖండిస్తూ ఆదివారం వజ్రకరూరు మండలం కొనకొండ్లలోని తన స్వగృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో నిజాలను నిగ్గు తేల్చాల్సిన బాధ్యత సీబీఐపై ఉందన్నారు. ఈ హత్యతో ఎలాంటి సంబంధం లేని వైఎస్ భాస్కరరెడ్డి, ఆయన తనయుడు వైఎస్ అవినాష్‌రెడ్డిని దోషులుగా చిత్రీకరించేందుకు కొన్ని రాజకీయ శక్తులు, పచ్చమీడియా కుట్రలు సాగిస్తున్నాయన్నారు. ఎల్లో మీడియాలోని కథనాలను ఆధారంగా చేసుకుని భాస్కరరెడ్డిని, అవినాష్‌రెడ్డిని నిందితులుగా పేర్కొనడం భావ్యం కాదన్నారు. వారి వ్యక్తిగత ప్రతిష్టకు భంగం కలిగించే ఇలాంటి చర్యలకు ఇకనైనా స్వస్తి పలకాలని కోరారు.

'అనంత'లో కళా ప్రతిభకు కొదువ లేదు

- సినిమా ప్రీ రిలీజ్ వేడుకల్లో దిశ డీఎస్పీ శ్రీనివాసులు


ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో పాల్గొన్న డీఎస్పీ శ్రీనివాసులు, సినిమా యూనిట్ సభ్యులు

అనంతపురం కల్చరల్: జిల్లాలో కళా ప్రతిభకు కొదువ లేదని దిశ డీఎస్పీ ఆర్ల శ్రీనివాసులు అన్నారు. జిల్లా వాసులు నిర్మించిన 'మహిషాసురుడు' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ నగరంలోని ఓ ఫంక్షన్‌హాలులో ఆదివారం రాత్రి జరిగింది. సీనియర్ కళాకారుడు రవికుమార్ దర్శకత్వంలో నార్పలకు చెందిన డాక్టర్ గురుప్రసాద్ హీరోగా స్వీయ నిర్మాణంలో రూపుదిద్దుకున్న ఈ సినిమా ఈ నెల 26న అన్ని జిల్లా కేంద్రాల్లో విడుదల కానుంది. ఈ క్రమంలో అనంతపురంలో ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. కార్యక్రమంలో అబ్బా టీవీ కామెడీ స్టార్ డాక్టర్ హరిప్రసాద్, హీరోయిన్ ధరణిరెడ్డి, చిత్ర నటులు హరిబాబు, కృష్ణారెడ్డి, స్వప్న, రిచా తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ క్రికెట్ క్రీడాకారుల ఎంపిక

అనంతపురం సప్తగిరి సర్కిల్: ఈ నెల 21 నుంచి 26వ తేదీ వరకూ వైఎస్సార్ జిల్లా కడప వేదికగా జరిగే టోర్నీలో పాల్గొనే జిల్లా సీనియర్, అండర్–23 క్రికెట్ క్రీడాకారుల ఎంపికలను ఆదివారం స్థానిక అనంత క్రీడా మైదానంలో నిర్వహించారు. జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ఎంపికలకు వివిధ ప్రాంతాలకు చెందిన 60 మంది క్రీడాకారులు హాజరయ్యారు. సుధీర్‌రెడ్డి, వినీల్‌కుమార్ సెలెక్టర్లుగా వ్యవహరించారు. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్‌లో ప్రతిభ చాటుకున్నవారిని జిల్లా జట్టుకు ఎంపిక చేశారు.

ప్రీ-పీహెచ్‌డీ దరఖాస్తుకు నేడు ఆఖరు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ పరిశోధన విద్యార్థులు ప్రీ–పీహెచ్‌డీ పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు సోమవారం తుది గడువుగా నిర్దేశించారు. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. పీహెచ్‌డీ అడ్మిషన్ పొంది 9 నెలలు గడువు పూర్తయిన వారు దరఖాస్తుకు అర్హులు.

బియ్యం ఉచితం


బియ్యం పంపిణీ చేస్తున్న దృశ్యం

రేషన్ కార్డులు	6,54,180
కార్డులో సభ్యులు	20,17,360
చౌక దుకాణాలు	1,645
ఎండీయూ వాహనాలు	405
నెలసరి కోటా	1,149.459 టన్నులు

- నెలసరి 6.54 లక్షల కార్డులకు 1,149 టన్నుల రేషన్ పంపిణీ
- ప్రతి నెలా 20.17 లక్షల మందికి లబ్ధి

అనంతపురం అర్బన్: పేదల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలు కార్యక్రమాలను ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నారు. ఈ క్రమంలో పేదలకు గత ఏడాది డిసెంబరు నుంచి ఉచితంగా నాణ్యమైన బియ్యం అందజేస్తున్నారు. కార్డులోని ప్రతి సభ్యునికి ఐదు కిలోల చొప్పున ప్రతి నెలా 1,149 టన్నుల బియ్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందజేస్తోంది.

ఇంటి వద్దకే బియ్యం

జిల్లాలో 1,645 చౌక దుకాణాల పరిధిలో 405 ఎండీయూ (మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్) వాహనాల ద్వారా బియ్యం పంపిణీ జరుగుతోంది. జిల్లావ్యాప్తంగా 6,54,180 రేషన్ కార్డులున్నాయి. కార్డుల్లో 20,17,360 మంది సభ్యులున్నారు. ప్రతి నెలా 1,149.459 టన్నుల బియ్యాన్ని ఎండీయూ వాహనాల ద్వారా ఇంటి వద్దకే ప్రభుత్వం చేరుస్తోంది.

నెలసరి రూ.4.43 కోట్ల భారం

కిలో బియ్యం సేకరణకు జగన్ సర్కార్ రూ.38.50 వెచ్చిస్తోంది. ఈ లెక్కన జిల్లాలోని కార్డు దారులకు ప్రతి నెలా 1,149 టన్నుల బియ్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ప్రతి నెలా రూ.4.43 కోట్లను వెచ్చిస్తోంది. గత ఏడాది డిసెంబరు నుంచి బియ్యాన్ని ఉచితంగా అందజేస్తోంది. ఇదంతా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై అదనపు భారం కావడం గమనార్హం. కేవలం పేదల సంక్షేమాన్ని ఆకాంక్షిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు.

ఎంతో మేలు



పేదలకు నాణ్యమైన బియ్యాన్ని ఉచితంగా ఇవ్వడమనేది చాలా గొప్ప విషయం. మా ఇంట్లో నేను, నా కొడుకు, కోడలు, ఇద్దరు పిల్లలు మొత్తం ఐదుగురు ఉన్నాం. రేషన్ బండి ఇంటి వద్దకే వస్తోంది. పైగా ప్రతి నెలా ఉచితంగా బియ్యాన్ని ఇస్తున్నారు.

– తిప్పమ్మ, శెట్టూరు గ్రామం, శెట్టూరు మండలం

పంపిణీ సక్రమం



కార్డుదారులకు నాణ్యమైన బియ్యాన్ని ప్రతి నెలా ఉచితంగా ప్రభుత్వం అందజేస్తోంది. బియ్యం పక్కదారి పట్టకుండా కార్డుదారులకు సక్రమంగా పంపిణీ జరిగేలా చర్యలు తీసుకున్నాం. అక్కడక్కడా ఎదురవుతున్న చిన్నపాటి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం.

– శోభారాణి, జిల్లా సరఫరాల అధికారి

సీనియార్టీకి ప్రాధాన్యతనివ్వండి

- డీఈఓకు ఉపాధ్యాయ సంఘాల నాయకుల విజ్ఞప్తి


డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న పీఆర్టీయూ నాయకులు

రాప్తాడు రూరల్: పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనానికి సీనియార్టీ ప్రాతిపదికన ఉపాధ్యాయులను నియమించాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎస్.విష్ణువర్ధన్‌రెడ్డి, టి.చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఆదివారం వారు డీఈఓ సాయిరామ్‌ను కలిసి వినతి పత్రం అందజేసి, మాట్లాడారు. అనారోగ్యం, సర్జరీలు చేయించుకున్న, చిన్నపిల్లలున్న మహిళా టీచర్లకు విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని, తగినంతమంది స్పెషల్ అసిస్టెంట్లను నియమించాలన్నారు. పరీక్షల సమయంలో సస్పెండ్ అయిన టీచర్లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. అలాగే మూడేళ్ల బోధనానుభవం ఉన్న ఉపాధ్యాయులకు మూల్యాంకనం చేసేందుకు అవకాశం కల్పించాలని ఆంధ్ర ప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జి. రవీంద్ర, ఆర్. శ్రీనివాస రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి విశ్వనాథరెడ్డి కోరారు. చంటి పిల్లల తల్లులకు, 58 ఏళ్లు పైబడిన వారికి, అనారోగ్యంతో బాధపడుతున్న ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలన్నారు. మూల్యాంకనం విధులకు స్పెషల్ అసిస్టెంట్ల నియామకంలో జిల్లా కేంద్రానికి చేరువగా ఉన్న మండలాలతో పాటు దూరంగా ఉన్న మండలాల ఉద్యోగులనూ పరిగణనలోకి తీసుకోవాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) జిల్లా అధ్యక్షుడు సూరీడు, ప్రధానకార్యదర్శి రమణారెడ్డి, రాష్ట్ర అదనపు ప్రధానకార్యదర్శి చంద్రశేఖర్, మనోహర్, చంద్ర తదితరులు డీఈఓను కోరారు.

జాగ్రత్తలతోనే అగ్ని ప్రమాదాలు దూరం


- శ్రీసత్యసాయి జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి శంకరప్రసాద్



పుట్టపర్తి టౌన్: సరైన జాగ్రత్తలు తీసుకుంటే వేసవిలో అగ్ని ప్రమాదాలు చోటు చేసుకోవని శ్రీసత్యసాయి జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి శంకరప్రసాద్ అన్నారు. ఆదివారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ... అధిక ఉష్ణోగ్రతల కారణంగా ఏదో ఒక చోట అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. చిన్నపాటి తప్పిదాలు పెనుముప్పుగా మారే అవకాశముంటుందని హెచ్చరించారు. కొన్ని సందర్భాల్లో ప్రాణనష్టం కూడా ఉంటుందని, చూస్తుండగానే ఆస్తులు బుగ్గవుతాయన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో అగ్ని ప్రమాదాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. గత ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది మార్చి 31వ తేదీ వరకూ శ్రీసత్యసాయి జిల్లా వ్యాప్తంగా చోటు చేసుకున్న 236 అగ్ని ప్రమాదాల్లో రూ.3,89,13,000 ఆస్తి నష్టం చోటు చేసుకుందన్నారు. సకాలంలో సమాచారం అందించడం ద్వారా రూ.104,46,30,000 ఆస్తిని అగ్నిమాపక సిబ్బంది కాపాడిందని గుర్తు చేశారు. ఎక్కడైనా అగ్ని ప్రమాదం సంభవిస్తే వెంటనే 101కు కాల్ చేసి సమాచారం అందించాలని కోరారు. కేవలం అగ్ని ప్రమాదాలు చోటు చేసుకున్నప్పుడే కాకుండా ఇతర విపత్కర పరిస్థితుల్లోనూ 101కు కాల్ చేయవచ్చునన్నారు. ఎవరైనా నీట మునిగినప్పుడు, ఇల్లు/పాఠశాలల్లో విష సర్పాలు ప్రవేశించినా, భారీకాయంతో ఉన్న రోగిని ఆస్పత్రికి తరలించాలన్నా 101కు కాల్ చేసి సాయం పొందవచ్చునన్నారు. అగ్ని ప్రమాదాల నియంత్రణపై ఈ నెల 20వ తేదీ వరకూ ప్రజలను చైతన్య పరిచే కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టినట్లు పేర్కొన్నారు.

వేరుశనగ వామికి నిప్పు

కనగానపల్లి: గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు రాజేయడంతో కనగానపల్లి మండలం తగరకుంట గ్రామానికి చెందిన రైతు గోవిందరెడ్డి గడ్డివామి కాలి బూడిదైంది. బాధితుడు తెలిపిన మేరకు... తనకున్న నాలుగు ఎకరాల్లో రబీ సీజన్‌లో సాగు చేసిన వేరుశనగ పంటను రెండ్రోజుల క్రితం రైతు తొలగించి, పొలంలోనే వామిగా వేశాడు. శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు రాజేయడంతో మంటలు వ్యాపించి వేరుశనగ కాయలతో సహా వామి పూర్తిగా కాలిపోయింది. ఘటనతో రూ.4 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు.


మంటల్లో కాలిపోతున్న వేరుశనగ వామి

పొలాల్లో గుర్తు తెలియని యువకుడి మృతదేహం



బత్తలపల్లి: మండలంలోని యర్రాయపల్లి సమీపంలో ఆదివారం ఉదయం గుర్తుతెలియని యువకుడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న ధర్మవరం రూరల్ సీఐ మన్సూరుద్దీన్; ఎస్‌ఐ టీపీ శ్రీహర్ష, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. కాగా, మృతదేహం తీరును బట్టి హత్యగా అనుమానాలు వ్యక్తమయ్యాయి. మరోప్రాంతంలో హత్య చేసి ఆటోలో తీసుకొచ్చి ఇక్కడ పడేసినట్లుగా భావిస్తున్నారు. హతుడిని 25 నుంచి 30 సంవత్సరాల్లోపు వయసున్న ముస్లింగా గుర్తించారు. బ్లూ జీన్స్ ఫ్యాంటు, ఎర్ర బనియన్, బ్రౌన్ కలర్ షర్ట్‌పై బ్లూ కలర్ చెక్స్ ఉన్నాయి. స్థానిక వీఆర్వో ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. హతుడి ఆచూకీ తెలిసిన వారు సీఐ (94407 96832), ఎస్‌ఐ (94407 96833)కు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

ద్విచక్ర వాహనాల ఢీ.. నలుగురికి గాయాలు

రాయదుర్గం రూరల్: స్థానిక వాల్మీకి నగర్‌లో ఆదివారం ఉదయం ద్విచక్ర వాహనాలు పరస్పరం ఢీకొన్న ఘటనలో నలుగురు బాలురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం ముగ్గురిని అనంతపురంలోని సర్వజనాస్పత్రికి, పరిస్థితి విషమంగా ఉన్న ఒకరిని బళ్లారిలోని విమ్స్‌కు తీసుకెళ్లారు. ద్విచక్ర వాహనాలను బాలురు అతి వేగంగా నడుపుతూ నియంత్రణ కోల్పోయి పరస్పరం ఢీకొన్నట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. కాగా, గాయపడిన వారు మైనర్లు కావడంతో కేసు నమోదు చేయలేదని పోలీసులు పేర్కొన్నారు.

టిప్పర్ ఎక్కడంతో నిద్రలోనే వ్యక్తి మృతి


మృతుడు కామేష్

ఆత్మకూరు: ఆరుబయలులో నిద్రిస్తున్న వ్యక్తిపై టిప్పర్ చక్రాలు ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... నంద్యాల జిల్లా జూటూరు మండలం పాములవాడ గ్రామానికి చెందిన కామేష్ (52)కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. జేసీబీ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ క్రమంలో ఆత్మకూరు సమీపంలోని ఓ రైతు పొలంలో మట్టిని తరలించే పనులకు వచ్చాడు. శనివారం పని పూర్తి కాగానే రాత్రి భోజనం చేసుకుని టిప్పర్ డ్రైవర్ మనోహర్‌తో కలసి అదే వాహనంలోనే నిద్రించాడు. అర్ధరాత్రి సమయంలో ఉక్కపోతగా ఉండడంతో టిప్పర్ నుంచి కిందకు దిగి వాహనం వెనుక ఆరుబయలులో నిద్రించాడు. ఆదివారం తెల్లవారుజామున నిద్రలేచిన టిప్పర్ డ్రైవర్... తన పక్కన కామేష్ లేకపోవడంతో బహిర్భూమికి వెళ్లి ఉంటాడని భావించి, వాహనాన్ని స్టార్ట్ చేసి వెనుకకు పోనిచ్చాడు. పెద్దగా కేక వినిపించడంతో వెంటనే టిప్పర్ ఆపి కిందకు దిగి చూడగా... గిలగిలా కొట్టుకుంటూ ప్రాణాలు వదిలిన కామేష్ కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఛాతీపై టిప్పర్ టైర్లు వెళ్లడంతో ఎముకలు నుజ్జునుజ్జై కామేష్ మృతి చెందినట్లు ప్రాథమిక దర్యాప్తులో నిర్ధారించారు. ఘటనపై కేసు నమోదు చేసి, ప్రమాదానికి కారణమైన టిప్పర్ డ్రైవర్ మనోహర్‌ని అదుపులోకి తీసుకుని విచారణచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆటో బోల్తా - వృద్ధుడి మృతి


మృతిచెందిన జయరాం నాయక్

గోరంట్ల: ఆటో బోల్తాపడిన ఘటనలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... గోరంట్ల మండలం కొమ్మలతండాకు చెందిన జయరాంనాయక్ (60), ఆదివారం రాత్రి మరో ఐదుగురు ప్రయాణికులతో కలసి ఆటోలో గోరంట్ల నుంచి బాగేపల్లికి బయలుదేరాడు. స్థానిక ఓ ప్రైవేట్ పాఠశాల వద్దకు చేరుకోగానే డ్రైవర్ వేగాన్ని నియంత్రించుకోలేక పోవడంతో ఆటో అదుపు తప్పి బోల్తాపడింది. ఘటనలో జయరాం నాయక్ అక్కడికక్కడే మృతి చెందాడు. కొత్తచెరువు మండలం పోతులకుంట గ్రామానికి చెందిన గంగాద్రి, గోరంట్ల మండలం పాపిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన రామలక్ష్మమ్మ, ప్రమీలబాయి, చిలమత్తూరు మండలం చిన్నపరెడ్డిపల్లి గ్రామానికి చెందిన వడ్డే శ్రీనివాసులు, చిలమత్తూరు నివాసి శంకరరెడ్డి గాయపడ్డారు. క్షతగాత్రులను వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్న ప్రమీలాబాయిని 108 అంబులెన్స్‌లో హిందూపురంలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

షూటింగ్ బాల్ జట్ల ఎంపిక రేపు

ఆత్మకూరు: సనప జెడ్పీహెచ్‌ఎస్ క్రీడా మైదానంలో ఈ నెల 18న అనంతపురం జిల్లా సీనియర్ బాలుర, బాలికల షూటింగ్ బాల్ జట్టు ఎంపికలు ఉంటాయి. ఈమేరకు జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి నాగరాజు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 18న ఉదయం 10 గంటలకు ఎంపికలు ప్రారంభమవుతాయని, ఆసక్తి ఉన్న వారు 83414 11083లో సంప్రదించాలన్నారు.

క్లుప్తంగా

అధైర్యపడొద్దు..



దామోదర్‌రెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి

ఆత్మకూరు: పి.యాలేరు సొసైటీ వైస్ ప్రెసిడెంట్ దామోదర్‌రెడ్డి (80) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. పి.యాలేరు సొసైటీ ప్రెసిడెంట్ తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి ఆత్మకూరుకు చేరుకొని దామోదర్‌రెడ్డి మృతదేహానికి పూల మాల వేసి, నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు. దామోదర్‌రెడ్డి ఎంతో కాలంగా సొసైటీ బ్యాంక్‌లో వైస్ ప్రెసిడెంట్‌గా ఉన్నారని, అందరితోనూ సన్నిహితంగా ఉంటూ పార్టీలోనూ చురుకైన కార్యకర్తగా పనిచేశారన్నారు. సొసైటీ డైరెక్టర్లు ఋషిరెడ్డి, మల్లన్న, హనుమంతురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లైసెన్సులు పునరుద్ధరించాలి

అనంతపురం టౌన్: డాక్యుమెంట్ రైటర్ల లైసెన్సులను పునరుద్ధరించాలని రైటర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాసరి సుధాకర్ అన్నారు. ఆదివారం రుద్రంపేటలోని వాల్మీకి భవన్‌లో డాక్యుమెంట్ రైటర్ల జిల్లా కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ డాక్యుమెంట్ రైటర్లకు గతంలో లైసెన్సు విధానం ఉండేదన్నారు. అయితే గత ప్రభుత్వాలు లైసెన్సు విధానం రద్దు చేయడంతో డాక్యుమెంట్ రైటర్లకు గుర్తింపు లేకుండా పోయిందన్నారు. లైసెన్సు విధానాన్ని పునరుద్ధరించాలని ఇప్పటికే రెవెన్యూ మంత్రికి సైతం వినతి పత్రాలు అందించగా, వారు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్యుమెంట్ రైటర్ల సంఘం నాయకులు పెనుమాక వెంకట సుబ్బయ్య, వర్ది రెడ్డి నాగార్జునరెడ్డి, అవ్వారు సత్యనారాయణ పాల్గొన్నారు.

దివ్యాంగులకు బాసటగా నిలుద్దాం

అనంతపురం సప్తగిరి సర్కిల్: దివ్యాంగుల ఉన్నత విద్యకు బాసటగా నిలుద్దామని ఆర్జాస్ స్టీల్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీధర్ కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక గుత్తి రోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్‌లో సమ్మిళిత ఉన్నత విద్యకు చేపట్టాల్సిన చర్యలపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డైరెక్టర్ శ్రీధర్, క్యాటరర్స్ రవికాంత్ రమణ , ఆర్జాస్ స్టీల్ దీప కృష్ణమూర్తి, హెల్ప్‌ద బ్లైండ్ ఫౌండర్ శివాజీరావు, ఆర్డీటీ డైరెక్టర్ దశరథ్, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ అన్నవరం, రిటైర్డ్ ప్రిన్సిపాల్ ఉష పాల్గొన్నారు. కార్యక్రమానికి ఆర్గనైజర్ వెంకటరమణ అధ్యక్షత వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ దివ్యాంగులకు ప్రభుత్వాలు ప్రాథమిక విద్యనందిస్తున్నాయని, ఉన్నత విద్యకు దశాబ్దాల కాలం నుంచి ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఉందన్నారు. జిల్లాలో సమర్థనం ట్రస్ట్ ఆధ్వర్యంలో సమ్మిళిత ఉన్నత విద్య, సాంకేతిక విద్య అందించేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. సాంకేతిక విద్య ద్వారానే అపార ఉద్యోగావకాశాలు పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. నగరంలోని హౌసింగ్ బోర్డులో మీనాక్షమ్మ ఫౌండేషన్ సహకారంతో మే 6న ప్రత్యేక సమ్మిళిత ఉన్నత విద్య శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు క్యాటరర్స్ రవికాంత్ రమణ స్పష్టం చేశారు.

నైపుణ్యాలు వెలికితీయాలి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

అనంతపురం సిటీ: ప్రత్యేక అవసరాల పిల్లల్లో ఉన్న నైపుణ్యాలను వెలికితీసి, వారిని జాతిరత్నాలుగా తీర్చిదిద్దాలని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ పేర్కొన్నారు. ఆదివారం తపోవనం, ప్రశాంతినగర్ రెండో క్రాస్‌లో ది రూరల్ ఎడ్యుకేషన్, డెవలప్‌మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సిల్వర్ జూబ్లీ వేడుకలకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ట్రస్ట్ ప్రతినిధులు, సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ ప్రత్యేక క్యాంపు

రాప్తాడురూరల్: బుక్కరాయసముద్రం వెంకటాపురం, దయ్యాలకుంటపల్లి గ్రామాల్లో అనంతపురం ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నగరూరు రసూల్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు. ఏడు రోజుల పాటు ఈ శిబిరం కొనసాగుతుందని డాక్టర్ నగరూరు రసూల్ తెలిపారు. కార్యక్రమంలో దయ్యాలకుంటపల్లి పాఠశాల హెచ్‌ఎం వసుంధర, స్కూల్ కమిటీ చైర్మన్ కృష్ణార్జున, క్లస్టర్ రీసోర్స్ పర్సన్ శివారెడ్డి, నడిమి ఎర్రప్ప పాల్గొన్నారు.

సహచట్టంపై అవగాహన అవసరం

అనంతపురం కల్చరల్: సమాచార హక్కు చట్టంపై సమగ్ర అవగాహన అవసరమని జిల్లా సహచట్టం పరిరక్షణ సంఘం ప్రతినిధులు వన్నూరప్ప, నబీరసూల్ అన్నారు. ఆదివారం స్థానిక విద్యుత్‌నగర్‌లోని సమాచార హక్కు చట్టం సంస్థ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఈనెల 26న కలెక్టర్‌తో సంస్థాగత విషయాలపై చర్చించాలని, 28న జిల్లా కార్యవర్గ సభ్యులు, ఇతర సంఘాల ప్రతినిధులకు చట్టంపై అవగాహన పెంచే సదస్సులు నిర్వహించాలని అన్నారు. కార్యక్రమంలో సభ్యులు రంగనాయకులు, బాలన్న తదితరులు పాల్గొన్నారు.

అనంతకు మహర్దశ

- నగరాభివృద్ధికి రూ.25 కోట్లు మంజూరు
- 19 ప్యాకేజీల్లోని అభివృద్ధి పనులకు టెండర్లు పూర్తి
- 15 ప్యాకేజీల్లోని రూ.21 కోట్ల పనులకు అగ్రిమెంట్



అనంతపురం క్రైం: 'అనంత' నగరానికి మహర్దశ కలగనుంది. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి వినతి మేరకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నగరాభివృద్ధికి రూ.25కోట్లు ప్రత్యేక నిధులు మంజూరు చేశారు. పనులకు సంబంధించి టెండర్ నిర్వహణ పూర్తయ్యింది. 19 ప్యాకేజీల్లో 15 ప్యాకేజీల్లోని రూ.21 కోట్ల అభివృద్ధి పనులకు అగ్రిమెంట్ పూర్తయ్యింది. నగర రూపురేఖలు మార్చేందుకు ఎమ్మెల్యే అనంత శ్రీకారం చుట్టారు.

నగరంలోని 36 డివిజన్లలో ప్రత్యేక నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు జరగనున్నాయి. 9.53 కిలో మీటర్లలో సీసీ రోడ్లు, 4.10 కిలో మీటర్లలో బీటీ రోడ్లు, 9.88 కిలో మీటర్లలో 48 బీటీ, సీసీ రోడ్లతో పాటు 25 మురుగునీటి కాలువలు నిర్మించనున్నారు. రెండో డివిజన్లలోని బిందెల కాలనీ, 8వ డివిజన్‌లోని రాణినగర్, 10వ డివిజన్ భవానీ నగర్, 24వ డివిజన్ నవోదయకాలనీ, తదితర ప్రాంతాల్లో కాలువలు నిర్మించనున్నారు.

నిర్మాణం కానున్న రెండు బ్రిడ్జిలు:
నడిమి వంకకు ఆనుకుని ఉన్న ప్రాంత ప్రజల సమస్యను ఎమ్మెల్యే అనంత ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. సోమనాథ్‌నగర్, 5,6 రోడ్లు కలిసే ప్రాంతంలో రూ.1.50 కోట్లతో బ్రిడ్జి (రెండు)లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ బ్రిడ్జిల నిర్మాణం పూర్తయితే అక్కడి ప్రాంత వాసులకు సమస్య తీరుతుంది. గత టీడీపీ ప్రభుత్వం ఇక్కడి అభివృద్ధి పనుల నిధులను చెరువుకట్ట అభివృద్ధికి మళ్లించారు. దీని ఫలితంగా గతేడాది వచ్చిన వర్షాలతో నడిమివంకకు ఆనుకొని ఉన్న ప్రజలు ముంపునకు గురయ్యారు. ఇవేకాక నగరంలో రూ.312 కోట్లతో ఫోర్‌వే, బ్రిడ్జి పనులు వేగవంతంగా సాగుతున్నాయి. వీటితో పాటు రూ.కోట్లతో గుత్తి రోడ్డు, శ్రీకంఠం సర్కిల్ నుంచి గుత్తి రోడ్డు, విద్యుత్‌నగర్ రోడ్డు, జేఎన్‌టీయూ, తదితర ప్రాంతాల్లో రోడ్లు, కాలువలు ఏర్పాటు చేశారు. నగరంలోని 7, 35, 39, 43, 44, 45, 48, 50 డివిజన్లలో బీటీ రోడ్లు ఏర్పాటు కానున్నాయి.

ఐదారు నెలల్లో పనుల పూర్తి :



నియోజకవర్గంలో 35 ఏళ్లలో ఎన్నడూలేని విధంగా అభివృద్ధి, సంక్షేమం జరిగింది. అనంతపురం నగరం, రూరల్ ప్రాంతాల రూపురేఖలు మార్చాం. గత టీడీపీ ప్రభుత్వంలో ఉన్న నియోజకవర్గానికి, ప్రస్తుతం వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో అభివృద్ధిలో వ్యత్యాసం కనిపిస్తోంది. నగరంలోని వివిధ ప్రాంతాల్లో సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి దృష్టికి తీసుకెళ్లాం. అందుకు స్పందించి రూ.25 కోట్లు మంజూరు చేసిన సీఎంకు ప్రత్యేక ధన్యవాదాలు. మరో ఐదారు నెలల్లో అభివృద్ధి పనులు పూర్తి చేస్తాం.
– అనంత వెంకటరామిరెడ్డి, ఎమ్మెల్యే

సంక్షిప్త సమాచారం

ప్రజల అభ్యర్థనలు తెలుసుకోవాలి
అనంతపురం క్రైం: ప్రతి డివిజన్‌లో ప్రజల అభ్యర్థనలు తెలుసుకొని, ఏమైనా ఉంటే ప్రజా మద్దతు పుస్తకంలో నమోదు చేయాలని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. నగరంలోని 50వ డివిజన్‌లోని ప్రజా మద్దతు పుస్తకాలను ఎమ్మెల్యేకు కార్పొరేటర్ గురుశేఖర్‌బాబు అందజేశారు. డివిజన్‌లోని 30 క్లస్టర్లలో 28 క్లస్టర్లలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం పూర్తయ్యింది. కార్పొరేటర్ గురుశేఖర్ బాబు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, తదితరులను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్, వైఎస్సార్‌సీపీ నగరాధ్యక్షుడు చింతా సోమశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

సామాజిక స్పృహతోనే వృత్తిలో రాణింపు
అనంతపురం: సామాజిక స్పృహ తోనే వృత్తిలో రాణిస్తారని ఎస్కేయూ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.సోమశేఖర్ పేర్కొన్నారు. ఎస్కేయూ ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ఆధ్వర్యంలో వారం రోజులపాటు నిర్వహించనున్న ఎన్ఎస్ఎస్ క్యాంపును ఆదివారం ప్రారంభించారు. వర్సిటీ హెల్త్‌సెంటర్ వద్ద పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పి. సత్యసాయ్య పాల్గొన్నారు.

నేటి నుంచి రుణాల రెన్యూవల్
ఆత్మకూరు: పంట రుణాల రెన్యూవల్ ఈనెల 17 నుంచి చేసుకోవచ్చని కెనరా బ్యాంకు సిబ్బంది ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 17 నుంచి 26 వరకు ఆత్మకూరు, కుర్లపల్లి, తిమ్మాపురం, నారాయణపురం, ఎంఎం హళ్లి గ్రామాల్లోని రైతులు రుణాలు రెన్యూవల్ చేసుకోవచ్చన్నారు.

ఘనంగా ముగిసిన నవకోటి దత్తహోమం
అనంతపురం కల్చరల్: నగరంలో మూడురోజుల పాటు జరిగిన నవకోటి దత్తహోమాలు ఆదివారం ముగిశాయి. దత్తాత్రేయస్వామికి ప్రత్యేక అభిషేకాలు, అలంకార సేవలు జరిగాయి. శృంగేరీ శారదా పీఠం ఆధ్వర్యంలోని పాతూరు దత్తాత్రేయస్వామి ఆలయంలో రుత్వికులు వేర్వేరు హోమ గుండాల వద్ద శాస్త్రోక్తంగా హోమాలు నిర్వహించారు.

పంపనూరులో ప్రత్యేక పూజలు
ఆత్మకూరు: పంపనూరు సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామి మూలవిరాట్‌కు ప్రత్యేక పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలు, బంగారు కవచం ధరింపజేసి, విశేష పూజలు చేశారు. ఆలయంలోని మంజునాథస్వామి, పార్వతీదేవికి పూజలు చేశారు.

నేడు 'స్పందన'
అనంతపురం క్రైం: నగరపాలక సంస్థలో సోమవారం ఉదయం 10.30 గంటలకు స్పందన కార్యక్రమం జరగనుంది. కార్యక్రమాన్ని డిప్యూటీ కమిషనర్ సావిత్రి నిర్వహించనున్నారు.

అప్రమత్తతతోనే అగ్ని ప్రమాదాల నివారణ
అనంతపురం శ్రీకంఠసర్కిల్: అప్రమత్తంగా ఉంటేనే అగ్ని ప్రమాదాలు నివారించొచ్చని అగ్నిమాపకశాఖ అధికారులు అన్నారు. ఆదివారం అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా నగరంలోని యువజన కాలనీ, రామ్ నగర్, అరవింద్ నగర్ ప్రజలకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. అగ్నిమాపకశాఖాధికారి అశ్వర్థ మాట్లాడుతూ గ్యాస్ ప్రమాదాలు, విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ఎలా అప్రమత్తంగా ఉండాలి.. ప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. అనంతరం అగ్నిమాపక సిబ్బంది మాక్ డ్రిల్ ద్వారా ప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

అనంత చిన్నారికి యంగ్ జీనియస్ అవార్డు



అవార్డు అందుకుంటున్న చిన్నారి యాషిక

రాప్తాడురూరల్: రాష్ట్రస్థాయి ఒలింపియాడ్ పరీక్షలో ప్రతిభ చాటిన అనంత విద్యార్థిని యాషికకు సీవీరామన్ యంగ్ జీనియస్ అవార్డు దక్కించుకుంది. 2022-23 సంవత్సరానికి ఫిబ్రవరిలో సుచిరిండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఒలింపియాడ్ పరీక్షలు నిర్వహించారు. నగరంలోని పేస్ ఇంగ్లిష్‌మీడియం పాఠశాలలో రెండో తరగతి విద్యార్థిని నరసగల్ల యాషిక జిల్లా స్థాయిలో మొదటి ర్యాంకు సాధించింది. ఆదివారం హైదరాబాద్ రవీంద్రభారతి ఆడిటోరియంలో అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి ఎన్‌వీ రమణ, సినీహీరో అడవి శేష్ ముఖ్యఅతిథులుగా హాజరై అవార్డులు ప్రదానం చేశారు. యాషికను సుచిరిండియా సీఈఓ డాక్టర్ వై.కిరణ్, తల్లిదండ్రులు ఎస్.విజయభాస్కర్, కీర్తి, పాఠశాల యాజమాన్యం అభినందించారు.

దానధర్మాలకు అత్యధిక ప్రాధాన్యత



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



ఇఫ్తార్ విందులో పాల్గొన్న నగర మేయర్, అనంత చంద్రారెడ్డి, ఫయాజ్ తదితరులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: రంజాన్ మాసం పవిత్రత కలిగినదని, ఈ నెలలో ధానధర్మాలకు అత్యధిక ప్రాధాన్యత ఉంటుందని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక పాతూరులోని మాజీ గ్రంథాలయ చైర్మన్ రషీద్ అహమ్మద్ నివాసం వద్ద అల్ అమీన్ చారిటబుల్ ట్రస్ట్, అల్ నిసార్ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో రంజాన్ పండుగను పురస్కరించుకొని రంజాన్ తోఫా అందించారు. డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య ఆధ్వర్యంలోనూ రంజాన్ తోఫా అందించారు. కార్యక్రమంలో మేయర్ వసీం, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్, జిల్లా వక్ఫ్‌బోర్డు సభ్యురాలు ఖమర్‌తాజ్, కార్పొరేటర్ బాబా, వైఎస్సార్‌సీపీ నాయకులు లక్ష్మీనగర్ ఖాజా, నాయకులు శ్రీకాంత్, ఖాజా, ట్రస్టు సభ్యులు ముర్షిదాబేగం, అర్షద్‌అహ్మద్, ఆదం నవాజ్, జంగాలపల్లి మసీదు ముతవల్లి బాబా తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం సప్తగిరి సర్కిల్: నగరంలోని పేద ముస్లింలకు ఆదరణ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం రంజాన్ తోఫా అందించారు. ట్రస్ట్ గౌరవ సభ్యులు షేక్ వలిబాషా, మొహమ్మద్ జిలాన్ ఆధ్వర్యంలో తోఫా అందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు తాడిమర్రి లాల్‌బాషా, ఉపాధ్యక్షురాలు ముంతాజ్, సెక్రటరి తాడిమర్రి ఫక్రుద్దీన్, ట్రెజరర్ షకీలుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

13వ డివిజన్‌లో ఇఫ్తార్ విందు
అనంతపురం సప్తగిరి సర్కిల్: నగరంలోని 13వ డివిజన్‌లో వైఎస్సార్‌సీపీ నాయకుడు షెక్షావలి ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి నిర్వహించిన ఇఫ్తార్ విందులో మేయర్ వసీం సలీం, మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు అనంత చంద్రారెడ్డి, మాజీ మంత్రి సాకే శైలజానాథ్ పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు తరిమెల అబుసాలెహ, ఇసాక్, రహంతుల్లా, వైఎస్సార్‌సీపీ నాయకులు దాదు, లక్ష్మీనగర్ ఖాజా, మదార్, మునీర్ బాషా, మహమ్మద్ రఫి, డాక్టర్ మునీర్ తదితరులు పాల్గొన్నారు.

అత్యంత పవిత్రమైనది ఉమ్రాయాత్ర
ఉమ్రా యాత్ర అత్యంత పవిత్రమైనదని ప్రభుత్వ ఖ్వాజీ మౌలానా హారూన్ రషీద్ స్పష్టం చేశారు. ఆదివారం స్థానిక చాందినీ మసీదులో హజ్ యాత్రికులకు శిక్షణ తరగతులను మసీదు కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లాలోని ఉరవకొండ, గుత్తి, అనంతపురం, తాడిపత్రి తదితర ప్రాంతాలకు చెందిన హాజీలు హాజరయ్యారు. కార్యక్రమంలో మసీదు కమిటీ సభ్యులు మునీర్‌బాషా, మొహమ్మద్ రఫి పాల్గొన్నారు.

ఇంటింటా సంక్షేమ పథకాలు



రాప్తాడు: చిన్మయనగర్‌లో 'జగనన్న మా భవిష్యత్తు' పోస్టర్లను పంపిణీ చేస్తున్న నాయకులు



ఆత్మకూరులో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రాప్తాడు: ఇంటింటా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ప్రజలు సంతృప్తిగా ఉన్నారని ప్రసన్నాయపల్లి గ్రామ పంచాయతీ సచివాలయ కన్వీనర్లు ఉషారాణి, భాగ్యలక్ష్మీ బోయ మనోహర్ అన్నారు. మండలంలోని ప్రసన్నాయపల్లి పంచాయతీలోని చిన్మయనగర్‌లో పదో రోజూ 'జగనన్న మా భవిష్యత్తు-మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యాప్తంగా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు కలిసి ఇంటింటికీ లబ్ధిదారులను పలకరించారు. టీడీపీ పాలనకు, జగనన్న పాలనకు ఉన్న తేడాను వివరించారు. ఇంటి యాజమాని అనుమతితో 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్లు అతికించారు. కార్యక్రమంలో గృహసారథులు మనోహర్, అంకాలమ్మ, సృజన, విద్య, షానుర్ బేగం, బోయ నరేష్, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామ గ్రామానా 'జగనన్నే మా భవిష్యత్'
ఆత్మకూరు: మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో కలిసి 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ప్రస్తుతం ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిపై ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఇంటికీ ఆనందంగా ప్రజలు సీఎం జగనన్న స్టిక్కర్లనను అతికించారు. కురుబ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పార్వతమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం చేసిన మేలును చూసి అభివృద్ధికే మద్దతు ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో గ్రామాల్లో సర్పంచులు, ఎంపీటీసీలు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలను చైతన్యపరిచేలా కేశవరెడ్డి సాహిత్యం

- అరసం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాచపాలెం చంద్రశేఖరరెడ్డి



కాంతిపూలు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రచయితలు, కవులు

అనంతపురం కల్చరల్: ప్రజలను చైతన్య పరిచేలా నందవరం కేశవరెడ్డి సాహిత్యం ఉంటుందని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ రాచపాలెం చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఎన్జీవో హోంలో నందవరం కేశవరెడ్డి రచించిన 'కాంతి పూలు' పుస్తకావిష్కరణ చేశారు. అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో ఈశ్వరరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాచపాలెంతో పాటు డాక్టర్ శాంతినారాయణ, డాక్టర్ బండి నారాయణస్వామి, మానవత సంస్థ తరిమెల అమరనాథరెడ్డి, శ్యామసుందరశాస్త్రి, రాజారామ్ తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో సీనియర్ కవులు ఏలూరు యంగన్న, హరినాథరెడ్డి, షరీఫ్, ఆనంద్‌కుమార్, ఈరన్న, సురేష్, మధురశ్రీ, రియాజుద్దీన్, వన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

'అనంత'నాటక రంగ సేవలు అభినందనీయం



వీరేశలింగం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: అనంత నాటక రంగ సేవలు అభినందనీయమని ఏపీ నాటక అకాడమీ చైర్‌పర్సన్ రాగే హరిత అన్నారు. ఆదివారం స్థానిక లలిత కళా పరిషత్తులో తెలుగు నాటక రంగ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నాటక అకాడమీ చైర్‌పర్సన్ రాగే హరిత, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చామలూరు రాజగోపాల్, ఎల్కేపీ కార్యదర్శి పద్మజ, సీనియర్ రంగస్థల నటులు వెంకటసుబ్బయ్య, సంగాల నారాయణస్వామి, సోమిరెడ్డి, వనజకుమారి, ఆర్వీ ప్రసాద్ తదితరులు హాజరై మాట్లాడారు. గుంటూరు జిల్లా కళాపరిషత్తు ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి నాటక పోటీలు నిర్వహించి, అనంత లలిత కళాపరిషత్‌కు అవార్డు ఇవ్వడం గర్వకారణమన్నారు. కళాప్రతిభ చాటిన జిల్లాలోని కళాకారులకు పురస్కారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో కళాభిమానులు రామాంజనేయులు, డీవై రఘు, దయానంద్, ఆనంద్, అస్లాంబాషా, లోకేష్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయిలోనూ రాణించాలి

- రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ వీసీఎండీ హర్షవర్ధన్



వీసీఎండీ హర్షవర్ధన్‌ను సన్మానిస్తున్న క్రీడాకారులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: జాతీయ, అంతర్జాతీయ స్థాయిలోనూ రాణించాలని రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ వీసీఎండీ హర్షవర్ధన్ సూచించారు. ఆదివారం స్థానిక ఇండోర్ స్టేడియంలో జిల్లా, రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన మాట్లాడుతూ క్రీడాకారులకు శాప్ ద్వారా అన్ని సౌకర్యాలూ కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సీఈఓ వెంకటేశులు, కార్యదర్శి నాగేంద్ర, పీడీలు గోపాల్‌రెడ్డి, ప్రసాద్, శ్రీకాంత్‌రెడ్డి, చంద్ర, సీనియర్ క్రీడాకారులు గంగులయ్య, సాయి, అశోక్, కిరణ్, పృథ్వీ పాల్గొన్నారు.

అత్యుత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దండి:
జిల్లాలోని క్రీడాకారులను అత్యుత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత కోచ్‌లదేనని రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) వీసీఎండీ హర్షవర్ధన్ అన్నారు. స్థానిక ఇండోర్ స్టేడియంలో అనంతపురం, శ్రీ సత్యసాయి పుట్టపర్తి జిల్లాల క్రీడా కోచ్‌లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఇదే సందర్భంలో ఖేలో ఇండియా కోచ్ రవీంద్రపై చర్యలు తీసుకోవాలని క్రీడాకారులు, వారి తల్లిదండ్రులు శాప్ వీసీఎండీకి విన్నవించారు. క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన కోచ్ క్రీడాకారులకు క్రీడల్లో వేధింపులకు గురి చేస్తున్నాడన్నారు. కార్యక్రమంలో చీఫ్ కోచ్ జగన్నాథరెడ్డి, కోచ్ వెంకటరమణ, అలి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లలోని సమస్యలు పరిష్కరించండి :
సాంఘిక సంక్షేమశాఖ హాస్టళ్లలోని సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ అదనపు డైరెక్టర్ హర్షవర్ధన్‌ను జిల్లా కేంద్రంలో ఏపీ మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కోదండరామిరెడ్డి విన్నవించారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ డీడీ విశ్వమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

వేసవి దుక్కులు..బోలెడు ప్రయోజనాలు

- కలుపు, చీడపీడలు నివారించొచ్చు
- ముందు జాగ్రత్తలు పాటిస్తే అధిక దిగుబడి
- రాప్తాడు వ్యవసాయాధికారి శుభకర్



రాప్తాడు: వేసవి దుక్కులతో రైతులకు అనేక ప్రయోజనాలు ఉన్నాయి. భూమి సారవంతమై, సూక్ష్మజీవులు, వానపాముల సంతతి పెరుగుతుంది. కలుపు, చీడపీడలు నివారించొచ్చు. పంటల సాగు పూర్తయ్యాక రైతులు భూములు అలాగే వదిలేస్తే భూమిలోని సారం దెబ్బతిని పంటలపై ప్రభావం పడుతుంది. భూమిలోని లోతైన పొరల నుంచి నీటిని లాగేస్తుంది.. ఈ ప్రమాదాన్ని నివారించడానికి రైతులు రబీ పంటలు చేతికందగానే దుక్కులు చేసి, భూమి ఆరబెట్టాలని రాప్తాడు ఏఓ శుభకర్ తెలిపారు. ఇలా చేయడం వల్ల అనేక ప్రయోజనాలు ఉంటాయని, సమగ్రసస్యరక్షణలో వేసవి దుక్కులు ఉపయోగపడతాయని ఆయన రైతులకు సూచిస్తున్నారు.

కలుపు మొక్కల నివారణ :
భూముల్లో పంట పెట్టకుండా అలాగే ఉంచితే కలుపు పెరిగి, భూసారానికి నష్టం కలుగుతుంది. చీడపీడలకు ఆశ్రయం కలుగుతుంది. మొండి జాతికి చెందిన తుంగ అన్ని రకాల భూముల్లోనూ ఎదుగుతుంది. బహువార్షిక వేర్లలో ఆహారాన్ని నిల్వ చేసుకొని భూసారాన్ని దెబ్బతీస్తుంది. వేసవిలో లోతైన దుక్కులు దున్నడం వల్ల వీటిని నివారించొచ్చు. పంట కాలం ముగిశాక భూములను ఖాళీగా ఉంచడం వల్ల పంటలను ఆశించే చీడ పురుగులు, తెగుళ్లను కలుగజేసే శిలీంధ్రాలు భూమి పొరల్లో ఆశ్రయం పొందుతాయి. దుక్కులు చేయడం వల్ల వేరుశన, పత్తి, కంది, చెరకు, పండ్ల తోటలను ఆశించే లద్దె పురుగు, బొంత పురుగు, పుచ్చపురుగు, దాసరి పురుగు, భూమి పొరల్లో దాగిన చీడ పురుగుల గుడ్లు, కోశాలు వెలుపలికి వచ్చి బయటి ఉష్ణోగ్రతలకు చనిపోతాయి. బయట పడిన ప్యూపాలు, గుండ్లను కొంగలు, పక్షులు తినడంతో పంటలకు చీడ పురుగుల బాధ తప్పుతుంది.



రాప్తాడులో ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న రైతన్న

వర్షాకాలానికి ముందే దుక్కులు చేయాలి..
వర్షాకాలం రాక ముందే భూమిని మూడుసార్లు దుక్కులు చేయాలి. ఇలా చేయడం వల్ల తొలకరి వర్షాలకు నేల మెత్తబడి నీళ్లు భూమిలోకి ఇంకుతాయి. దుక్కులు లోతుగా, వాలుగా అడ్డంగా దున్నుకుంటే వర్షపు నీరు భూమిలోకి ఇంకి తేమను నిల్వ చేసే అవకాశం ఉంటుంది. దుక్కి దున్ని భూమిని ఎండబెట్టడం ద్వారా కలుపు మొక్కలను నివారించొచ్చు. దుక్కులు దున్నే ముందు భూమిలో పశువుల పేడ, కంపోస్టు ఎరువులు, చెరువు మట్టిని వేయాలి. దీంతో భూమిసారవంతం అవుతుంది. తేమ నిల్వ చేసుకునే సామర్థ్యం పెరుగుతుంది. భూములను అలాగే వదిలేస్తే పొరలు గట్టిపడతాయి. పంటలు వేసిన సమయంలో నారు సరిగ్గా చొచ్చుకునిపోదు. దీంతో పోషక పదార్థాలు సరిగా అందక మొక్కల్లో ఎదుగుదల లోపిస్తుంది. వేసవిలో లోతుగా దుక్కి దున్నడం వల్ల భూమి గుల్లగా మారుతుంది. దీంతో భూమిలో నీటి నిల్ల సామర్థ్యం పెరగడమే కాకుండా తేమలో జీవించే సూక్ష్మజీవులు, వానపాములు సంతతి వృద్ధి చెందుతుంది.

ఖర్చు తగ్గించుకోండిలా..
కేవలం ఒక పంటకు రూ.60వేలు ఖర్చు పెట్టడం కన్నా చక్కటి యాజమాన్య పద్ధతులతో సాగుకు అయ్యే ఖర్చును తగ్గించుకోవచ్చు. సాగుకు ముందే భూసారాన్ని పరీక్షించి, లోపాలుంటే వాటికి అవసరమయ్యే సూక్ష్మ పోషకాలు అందించాలి. మొలకలు నాటిన అనంతరం చీడపీడల నివారణకు రూ.వేలు ఖర్చు చేయకుండా వేప నూనె, పంచగవ్య, ఎర పంటలను సాగు చేసి తెగుళ్లు సోకకుండా ముందస్తు చర్యలు చేపట్టొచ్చు. వేసవిలో నీటి కొరతను దృష్టిలో ఉంచుకొని నీటిని పారించే పద్ధతి కన్నా బిందు సేద్యం అవలంబించాలి.